జయ కృష్ణా ముకుందా మురారీ

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సీతంపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గోపాలుడి నామస్మరణ అంతటా మార్మోగుతోంది. శ్రీయశోద కృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో సీతంపేట కూడలిలో గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యశోద కృష్ణ సేవా సంఘం ప్రతినిధులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో ప్రత్యేక పూజలు

అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. పీఠం దర్బారు హాల్‌లో ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన పాలరాతి విగ్రహాలను పట్టువస్త్రాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో వేద పండితులు అష్టోత్తర నామాలతో అర్చన చేసి, పలు రకాల ప్రసాదాలను స్వామికి నివేదించారు. బహుళ అష్టమి సందర్భంగా ఉదయం చండీ హోమం, సాయంత్రం కాళీ కాలభైరవ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా ఉట్టి సంబరం

జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో రాధాకృష్ణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఉట్టి కొట్టే సంబరం నిర్వహించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక యువత ఉట్టి కొట్టడానికి ఉత్సాహంగా పోటీ పడ్డారు. ఇసరపు వెంకటలక్ష్మి, నమ్మి వెంకట్, ఇసరపు అప్పారావు, ఇసరపు వేణు, రాజేష్, రాంకుమార్, వాసు, కిషోర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


లలితా పీఠంలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు


తాటిచెట్లపాలెంలో చిన్నికృష్ణులు, గోపికల వేషధారణల్లో అలరిస్తున్న చిన్నారులు,


బాలగోపాలుడు

కన్నయ్యకు ప్రత్యేక పూజలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో భక్తులకు గోపాలుడు దర్శనమిచ్చాడు.

• 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిన్నికృష్ణులు, గోపికల సందడి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ్ స్కూల్‌లో ప్రైమరీ చిన్నారులు ప్రత్యేక వేషధారణల్లో ఆకట్టుకున్నారు. స్కూల్ ప్రాంగణంలో కృష్ణుడి విగ్రహం ముందు వీరంతా చిన్నికృష్ణులు, గోపికలుగా అలంకరించుకుని ఆడిపాడారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఐ.భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.సునీత, ఇన్‌చార్జి టీచర్ కె.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వైభవుడి ఆలయంలో కనుల పండువగా..

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని ఆలయాలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5 గంటలకు కనుల పండువగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మాధవస్వామి మహిళా కోలాట బృందం చిన్నారులు ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. 6 గంటలకు అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 7 గంటలకు ఉట్టు కొట్టు సంబరం నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో..

పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడి విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది. ఆశ్రమ నిర్వాహకుడు ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన జన్మాష్టమి వేడుకల్లో వృద్ధులు శ్రీకృష్ణుడికి పూజలు చేశారు.


సీతంపేటలో మహిళలకు చీరలు అందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు, గోవింద్


సీతంపేటలో ఉట్టి సంబరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్


వానప్రస్థ ఆశ్రమంలో కృష్ణుడికి పూజ చేస్తున్న వృద్ధురాలు


నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు


నక్కవానిపాలెంలో గోపాలుడికి పూజలు చేస్తున్న భక్తులు

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన కె.కె.రాజు


కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను ఆయన చాంబర్‌లో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల తోపాటు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కొద్ది సేపు కమిషనర్‌తో చర్చించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం

ఏయూక్యాంపస్: జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు గాయత్రి విద్యా పరిషత్ వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్ లోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి సీనియర్ వైద్యులు పద్మినీదేవి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి పౌష్టికాహారం అవసరమన్నారు. ఆధునిక ఆహార అలవాట్లకు స్వస్తి చెప్పి సహజ ఉత్పత్తులు, రసాయనాలు లేని ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పలు నమూనాలను విద్యార్థులు తయారు చేయగా, ఆమె వీటిని పరిశీలించి ఉత్తమ నమూనాలకు బహుమతులు అందజేశారు. పాఠశాల స్థాయి నుంచి మంచి ఆహార అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవాల్సిన అవసరాన్ని పలు ఉదాహరణలో వివరించారు. శరీరంలో పౌష్టికాహార లోపం ఫలితంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, వారి పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల డాక్టర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డి దృష్టికి ట్రాఫిక్ సమస్య


రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కలిసిన మసీద్ కార్యనిర్వహక సభ్యులు

కొమ్మాది: రైల్వే న్యూకాలనీలోని మసీద్ ముఖద్వారం వద్ద ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, వీఐపీ వాహనాల రాకపోకల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మసీద్ ఎ హుదా తరపున మసీద్ కార్యనిర్వహక కమిటీ సభ్యులు గురువారం ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వీటికి ప్రత్యామ్నాయంగా మసీద్‌కు రెండో వైపు ఉన్న రహదారి అడ్డంకులు తొలగించి అందుబాటులోకి తీసుకుని రావాలని వారు ఆయనను కోరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పాడేరు నియోజకవర్గ ఎన్నికల పార్టీ పరిశీలకుడు ఐహెచ్ ఫారుఖీ, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సాహిని సీతారామ్ శత జయంతి

సీతంపేట: విశాఖ సిటీ శిష్టకరణ సంఘం వ్యవస్థాపకుడు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సాహిని సీతారామ్ శత జయంతి వేడుకలు అబిద్‌నగర్‌లోని సౌభాగ్య సదన్‌లో గురువారం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది సాహిని రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీతారామ్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సీతారామ్ కుమారుడు సాహిని సత్యానంద్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సీతారామ్ కుటుంబ సభ్యులు ఎస్.శ్రీనివాస్, ఎస్.రామదయాల్ పాల్గొన్నారు.

కాలభైరవుడికి అభిషేకం

సీతమ్మధార: అష్టమి సందర్భంగా గురువారం నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో కొలువైన కాలభైరవ స్వామికి అర్చకుడు రాజాస్వామి అభిషేకం, విశేష పూజలు చేశారు. భక్తులు గుమ్మడి కాయలో నెయ్యి దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. ఆలయ సిబ్బంది వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ఓటర్ల పరిశీలనపై సమీక్ష


సమీక్షిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీవో) హుస్సేన్ సాహెబ్ గురువారం జీవీఎంసీ జోన్–5 పరిధి పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఎల్‌వో యాప్‌లో ఇంటింటి ఓటర్ల పరిశీలన, నమోదు, ఫారమ్స్ డిజిటలైజేషన్ వంటి అంశాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, జోన్–8 కమిషనర్ మల్లయ్యనాయుడు, గోపాలపట్నం తహసీల్దార్, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర

తాటిచెట్లపాలెం: విశాఖ నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రైల్వే న్యూకాలనీ వినాయక గుడి నుంచి 80 ఫీట్ రోడ్డు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ చేపట్టిన జోడోయాత్రకు ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాదయాత్ర చేపట్టినట్లు ముఖ్య అతిథి ఏఐసీసీ సెక్రటరీ క్రిస్టోఫర్ తిలక్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరావు, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి హైదర్ ఆలీ సింకా, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా జీవిద్దాం


శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

సీతంపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని ఎకో ఇండియా అధినేత దీపా ఝూ పిలుపునిచ్చారు. ఎకో ఇండియా, నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పర్యావరణంపై రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆర్‌జేడీ జ్యోతికుమారి, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ హితంగా ఎలా జీవించాలన్న విషయాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలన్నారు. దాని కోసం పాఠశాలలో నిర్వహించవలసిన కార్యక్రమాలు, వాటిని అమలు చేయవలసిన విధానాల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ పర్యావరణానికి అనుకూలమైన జీవన పద్ధతులు అవలంభించి జీవ వైవిధ్యాన్ని సంరక్షించాలన్నారు. ఈ సందర్భంగా పలు రకాల సేంద్రియ ఉత్పత్తులు, ఔషధ మొక్కలను, పర్యావరణ సంరక్షణ మీద మన్యం జిల్లా కో ఆర్డినేటర్ జి.రాజు గీసిన వివిధ పెయింటింగ్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ పి.నీలకంఠ, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకులు జె.వి.రత్నం, విశాఖ జిల్లా ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ ఎస్.బాబూరావు, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎకో ఇండియా అధినేత దీపా ఝూ

పరంధాముడే ఆత్మబంధువు

మురళీనగర్: లోక రక్షకుడు శ్రీకృష్ణ పరమాత్ముడే మనందరి ఆత్మబంధువని వానప్రస్థ వృద్ధాశ్రమ చైర్మన్ రొబ్బి శ్రీనివాసరావు అన్నారు. మురళీనగర్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బీకే అపరంజి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. గీతా సారాంశాన్ని అర్థం చేసుకుంటే మనిషి ఎలా జీవించాలనేది అవగతమవుతుందని వివరించారు. మన పురాణాలు, ఇతిహాసాలు భారతీయ ఆత్మకు చిహ్నాలని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయం రాజయోగం ద్వారా ప్రజలకు ఉత్తమ మార్గంలో జీవించే విధానాన్ని తెలుపుతోందన్నారు. బీకే అపరంజి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజయోగ మెడిటేషన్ ద్వారా ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోగలరన్నారు. కరోనా కాలంలో వేలాది మందికి విశిష్ట సేవలు అందించిన రొబ్బి శ్రీనివాసరావును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా బాలబాలికలు వేషధారణలు అలరించాయి. బ్రహ్మకుమారీల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.


రొబ్బి శ్రీనివాసరావును సత్కరిస్తున్న బీకే అపరంజి, బ్రహ్మకుమారీలు

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేకం సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రావణ లక్ష్మీ పూజలు గురువారం నాటికి 22వ రోజుకు చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కుంకుమ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



నేడు ఉచిత శ్రావణలక్ష్మి పూజలు..

ఆలయంలో శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. ఉదయం 6.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు కలశం కోసం చెంబు, ఆచమనం కోసం గ్లాసు తెచ్చుకోవాలని ఈవో కె.శిరీష తెలిపారు.

ఉత్తమ కస్టమర్‌గా ఏపీ స్వర్ణకార సంఘం

బీచ్‌రోడ్డు: ఉత్తమ కస్టమర్‌గా ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘాన్ని బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ మేరకు గురువారం సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్‌ను బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్ణ ట్రేడ్ సెంటర్ బ్రాంచ్ మేనేజర్ రామ్మోహన్ ఘనంగా సత్కరించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ వార్షికోత్సవాన్ని బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. స్వర్ణకారుల సంఘం నగర అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెద్దపూడి బ్రహ్మజీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

మద్రిపాలెం: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన హనుమంతరావు అనే వృద్ధుడు తన కుమారుడు రాజాబాబుతో కలిసి కంచరపాలెం ధర్మానగర్‌లో నివసిస్తున్న మరో కుమారుడు వరప్రసాద్ ఇంటికి వచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ధర్మానగర్ వద్ద రోడ్డు దాటుతుండగా.. గుర్తుతెలియని కారు అతడిని ఢీకొట్టడంతో తలకు గాయాలు కాగా.. కేజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. రాజాబాబు ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం


దాసరి అనూష

మద్రిపాలెం: బాలిక అదృశ్యంపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దుర్గానగర్‌లో తల్లి దండ్రులతో నివసిస్తున్న దాసరి అనూష(17) ఈ నెల 5వ తేదీ సాయంత్రం తన స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి సత్య ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరానగర్‌లో బైక్ చోరీ

మద్రిపాలెం: ద్విచక్ర వాహనం చోరీ అయిందని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిసిన వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్–4లో నివసిస్తున్న ప్రతాప్‌కుమార్ ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటిముందు బైకు పార్క్‌చేశాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి అది కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో ఎస్‌ఐ సునీల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామం, యోగా, ధ్యానంతో ఆరోగ్యం



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఆరోగ్యకరమైన అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటితో ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండవచ్చని డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. రైల్వే ఉద్యోగులు, సిబ్బంది కోసం వాల్తేర్ డివిజన్ ప్రేరణ పేరుతో గురువారం దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే మానసిక ప్రశాంతత, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని ఉద్యోగులకు సూచించారు. హెల్త్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్ టెక్నిక్స్‌ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రేరణాత్మకమైన కేస్‌స్టడీల ద్వారా పలు విషయాలు వెల్లడించారు. అనంతరం రైల్వే ఉద్యోగులు అడిగిన ప్రశ్నలకు సూర్యారావు సమాధానమిచ్చారు. ఈ సమావేశాల ద్వారా సిబ్బందిలో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం కలిగిస్తూ, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ఇటువంటి సెమినార్‌లకు ప్రజలను ప్రభావితం చేసిన, చేస్తున్న పలువరు ప్రత్యేక వ్యక్తులను తీసుకొచ్చి వారి అనుభవాలు, ఆలోచనలు, సూచనలు, సలహాలు ఉద్యోగులకు తెలిసేలా చేస్తూ వారిలో నూతనోత్సాహాన్ని నింపుతున్నట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ కూటికుప్పలను డీఆర్‌ఎం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), వివిధ విభాగాలకు చెందిన బ్రాంచి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలకు డిమాండ్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లోని సర్వే నంబర్ 12లో గెడ్డ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న భవనాన్ని కూల్చివేసి, అక్రమ నిర్మాణదారులపై చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 12లో సుమారు 130 గజాల విలువైన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా పక్కా భవనం నిర్మిస్తున్న నేపథ్యంలో రజకుల ఫిర్యాదుతో స్థానిక ప్రజాప్రతినిధులు పరిశీలించి గెడ్డ పోరంబోకు స్థలంగా నిర్ధారించారని గుర్తుచేశారు. అర్బన్ తహసీల్దార్ ఆదేశాలతో జీవీఎంసీ సిబ్బంది అక్రమ భవనాన్ని కూల్చివేశారన్నారు. ఇటీవల కొంతకాలంగా కూల్చివేసిన భవనం స్థానంలో నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని స్థానిక రజకులు తమ పార్టీని సంప్రదించగా.. కలెక్టరేట్ స్పందనలో గత నెల 28న ఫిర్యాదు చేశామని చెప్పారు. అనంతరం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి వచ్చి భవంతిని కూల్చకుండా వెనుదిరిగారన్నారు. తర్వాత యథావిధిగా భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, దీనిపై జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ ఉత్తర నియోజకవర్గ కార్యదర్శి పి.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణరావు, స్థానిక రజకులు కోనేటి లక్ష్మి, కోనేటి నూకరాజు, కోరిబిల్లి సంతోష్, కె.అప్పారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

సింహగిరీశుడికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: సింహగిరీశుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన నేత్రపర్వంగా జరిపించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడామండపంలోని వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం కనులపండువగా జరిపించారు. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజీపజేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.


స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

ఉత్సాహంగా స్టూడెంట్ కౌన్సిల్ ఉత్సవాలు


నృత్యంతో అలరిస్తున్న విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గురువారం 66వ స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. కొత్త విద్యా సంవత్సరంలో చేరిన ఇంటర్, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థినులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వైవీ అనురాధ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారత పొందినట్లన్నారు. కళాశాలతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ రాధాకృష్ణను సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మిస్ ఫ్రెషర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డిగ్రీ విభాగంలో సాయి, పావని, మానస, ఇంటర్ విభాగంలో ఈశా, సూర్యవినయ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, జయలక్ష్మి, మేరీ విజయరత్న, అధ్యాపకులు, కౌన్సిల్ సలహాదారులు పాల్గొన్నారు.